**మంటలు. సుళ్ళు తిరుగుతోన్న పొగలు. సెగలు చిమ్ముతోన్న పెనుకేకలు. రణగొణ ధ్వనులు. ఆ శీతాకాలపు సంధ్యా సమయంలో కూడా విజయవాడ నగరపు వీధులు రోహిణీకార్తె మధ్యాహ్నపు వీధుల్లా నిర్మానుష్యం. తుఫాను తీసిననాటి అరటితోటల్లా ఎక్కడ చూసినా విధ్వంసం - విధ్వంస దృశ్యం.**

బయటే గాదు 'వర్లు' స్వంత ఇంటిలోనూ అదే గందరగోళం. ఇంట్లోనేగాదు అతని మనస్సులోనూ అపరిమితమైన ఆందోళన. మొద్దుబారినతనం. చేష్టలుడిగిన క్షణాలు. చుట్టూ ఫర్నిచరూ, టీవీలూ, ఫ్రిజ్జూ, క్రోకరి - తునాతునకలుగా. బయట కుండీలలోని మొక్కలన్నీ పగిలి, తలలు వాల్చి... దూరాన సీతారాంపురంలో తగలడుతోన్న అడితీలలో ఫెటేల్మంటోన్న వెదురుబొంగుల శబ్దం. దగ్గర్లో మాచవరంలో పోలీసు కాల్పుల శబ్దం. మనస్సులోనో రోడ్లమీదో చెట్లు కూలుతోన్న ధ్వని. వేలాది పసిగందుల రోదనా శబ్దాలు.

అన్ని శబ్దాల మధ్య ఫోను గణగణ. ఆశ్చర్యం. అన్నీ ధ్వంసమయినా ఫోనింకా పని చేస్తోందా? మళ్ళా ఇది మరో హెచ్చరికా? తనమీద జరగనున్న మరో దాడికి సంకేతమా? ఇంకా దాడిచేసి ధ్వంసం చేయడానికి తనింట్లో ఏం మిగిలి ఉంది? అంతా సర్వనాశనం గాలేదూ? లక్షల విలువచేసే వస్తువులు సమస్తం తుడిచిపెట్టుకు పోలేదూ? ఏమిగిలిందీ ఇంకా?

ఎందుకు మిగల్లేదూ? తన ప్రాణాలు. భార్య ఉష ప్రాణాలు. పద్నాలుగేళ్ళ బాబు శ్రీకర్ ప్రాణాలు. ఎనిమిదేళ్ళ పాప సౌమ్య ప్రాణాలు... చాలా ఉన్నాయి కోల్పోడానికి. చాలా ఉన్నయి వాళ్ళు కొల్లగొట్టడానికి.

భయంగా దిగులుగా ఫోను ఎత్తాడు వర్లు...

★★★

''ఒరే వర్లూ. నేనురా జాకీని'' ఫోను హోరెత్తేలా అరిచాడు జాకీ.

''హాయ్. నువ్వా... ఊ చెప్పు చెప్పు''

''చెప్పా. బాటా కంపెనీది. సరెసరె తిట్టక వెధవ జోకని. అది సరేగానీ సాయంత్రం మన తెలుగు సంఘం మీటింగుకు వస్తున్నావా? మనం నాటం వేసి చాలా కాలమయిపోయింది. ఈ ఉగాదికి చీమకుట్టిన నాటకం వేస్తే ఎలా ఉంటుందీ? ఆలోచించు. సాయంత్రం మీటింగుకు మాత్రం తప్పకుండా రా...''

''వస్తా. వస్తా. అసలు మనం కలిసి కూడా వారం దాటిపోయింది. బెంగగా ఉంది. మీటింగు మన మూర్తిగారి ఆఫీసులోనే గదా. వస్తా. బై'' ఫోను పెట్టేశాడు వర్లు.

వర్లు అసలు పేరు పిన్నమనేని వెంకటేశ్వర్లు. జాకీ స్వంతపేరు ఆచంట జానకిరామశర్మ. వాళ్ళుంటోన్న పారిస్ నగరంలో అంతంత పేర్లు చెల్లనే చెల్లవు గాబట్టి ముద్దుగా వర్లు జాకీ అంటూ కుదించుకున్నారు.

వాళ్ళ సొంత ఊరు యానాం. పుట్టిందీ పెరిగిందీ పాక బడుల్లో చదువుకొన్నదీ హైస్కూలు గడిచిందీ అంతా అక్కడే, ఒకే వయసు వాళ్ళు. హైస్కూలు ముగిసే సమయంలో వాళ్ళవాళ్ళ నాన్నలిద్దరూ వాళ్ళకు ఉన్న ఫ్రెంచి పౌరసత్వపు హక్కును వినియోగించుకొని పారిస్ వెళ్ళి స్థిరపడటంతో పదహారణాల తెలుగు కుర్రాళ్ళు కాస్తా ఒక్కసారిగా నూరుశాతం ఫ్రెంచి యువకులయిపోయారు. పారిస్‌లోనే డిగ్రీలు చేశారు. కంపల్సరీ మిలటరీ సేవ కూడా చేశారు. అంతా కలిసే చేసారు. అది పాతికేళ్ళ క్రిందటి సంగతి. ప్రస్తుతం ఎవరి ఉద్యోగాల్లో వాళ్ళు బాగా స్థిరపడిపోయారు. అయినా చిన్నతనపు మమతలూ మమకారాలూ పసివాయవు గదా - ఇద్దరికీ యానాం అన్నా తెలుగుదేశమన్నా ఎంతో అభిమానం.


వర్లు ఓ మల్టీ నేషనల్ ఎరువు కంపెనీలో మార్కెటింగ్ మేనేజ్. జాకీ ఓ ప్రముఖ పారిస్ కంప్యూటర్ల కంపెనీలో ఇంజనీరు.

ఎప్పుడూ ఎనిమిది దాకా ఆఫీసు వదలని వర్లు ఆ రోజు అయిదింటికే పనికట్టిపెట్టి ఆఫీసులోంచి బయటపడ్డాడు. నగరపు నడిబొడ్డున సైన్‌నదీ మధ్యన ఉన్న ఓ ద్వీపంలోని తన ఆఫీసు భవనం దిగి వచ్చి కుడివేపుకు మళ్ళాడు. లోవ్‌రే మ్యూజియం దాటాడు. పక్కనే నాట్రిడామ్ చర్చి... ఇంకొంచెం పడమరగా నడవగా కాన్‌కార్డ్ ప్లేస్... పది రహదార్ల కూడలి ప్రదేశం. ఎదురుగా విశ్వవిఖ్యాత షాంప్‌ఎలిజీ రాజమార్గం. దూరాన ఫ్రెంచి విప్లవపు ద్విశత వార్షికోత్సవ చిహ్నంగా నిర్మించిన ఆర్క్‌డి ట్రంఫ్ - విజయతోరణం. అన్నేళ్ళుగా ఆ రహదారినీ దాని అందాన్ని దాని గాంభీర్యాన్ని చూస్తూనే ఉన్నా, వర్లుకు దాన్ని చూసిన ప్రతిసారీ ఒళ్ళు పులకరిస్తూనే ఉంటుంది. అందుకే గదా కీట్స్ అన్నది 'ఏ సౌందర్య బిందువైనా ఆనంద ఆనంద సింధువే'నని!

పారిస్ నగరంలో యునెస్కో సంస్థలో ఓ ఉన్నత ఉద్యోగంలో ఉన్న మల్లు కృష్ణమూర్తిగారి ఆఫీసులో ఆ మీటింగు. ఆయనే అక్కడి తెలుగువాళ్ళ పెద్దదిక్కు. వర్లూ జాకీలలాంటి వాళ్ళు దాని కార్యనిర్వాహక సభ్యులు. రానున్న ఉగాది ఉత్సవం ఎలా ఎక్కడ జరపాలీ అన్న విషయం చర్చించడానికి ఆ సమావేశం, చర్చలు మొదలయ్యాయి.

ఉన్నట్టుండి ఉరుములేని పిడుగులా వర్లు మాట్లాడాడు.

''క్షమించండి. మనం చర్చిస్తోన్న విషయం పక్కనపెట్టి మరో విషయం ప్రస్తావిస్తున్నందుకు కోప్పడకండి. ఈ తెల్లవాళ్ళ దేశాల్లో మన ఇండియన్లంటే చిన్నచూపు ఎక్కువవుతోంది. మీరు వినేవుంటారు - మొన్న ఐఫిల్‌టవర్ దగ్గర తెల్లకుర్ర వెధవలు మన భారత వనితల చీరలు చూసి గేలిచేసి కొంగులు లాగారు. అటు ఇంగ్లండ్‌లో స్కిన్‌హెడ్స్ అన్న అల్లరిమూకలు మన మీద దౌర్జన్యాలు చేస్తున్నాయి. అమెరికాలో కూడా డాట్‌బస్టర్స్ అన్న వెధవ సంఘం ఒకటి బయలుదేరి నుదుటబొట్టు ఉన్న ఆడవాళ్ళందర్నీ వేధిస్తున్నారు. ఎలా ఇంతకాలం? మనం గాజులు



# మృగతృష్ణ-మాయలేడి

**దాసరి అమరేంద్ర**

తొడుక్కుని కూర్చోవడమేనా? మనమంతా కలసికట్టుగా నిలబడి ఈ ధోరణులను ఎదుర్కోకపోతే పరిస్థితి శృతిమించి తీరుతుంది'' ఆవేశంగా సాగింది వర్లు ధోరణి-

''వర్లూ! మనం ఇలా పరాయి దేశాలను మన దేశాలుగా అంగీకరించి వచ్చి స్థిరపడినపుడు మరి ఆయా దేశాల సంస్కృతీ సభ్యతలతో ఎంతో కొంత సర్దుకుపోయి ప్రవర్తించని పక్షంలో ఈ ఇబ్బందులు తప్పవేమో '' అన్నాడు జాకీ.

''ఏవిటా విభీషణుడి మార్కు మాటలూ? అసలు వీళ్ళకు మనమంటే ఇష్టం లేదు. చాకిరీ కోసం మనల్ని రప్పించుకొంటున్నారు. అంతమాత్రాన బానిసల్లా ట్రీట్‌చేస్తే మనం సహించాలి?'' ఉరిమాడు వర్లు.

మౌనమే మంచిదనిపించింది జాకీకి.

''సో ఫ్రెండ్స్. మనమంతా కలసి మన గవర్నమెంటుతో దెబ్బలాడటం అవసరం. నలభైలనాటి నాజీ కథలు పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రతిఘటనే మన ఆయుధం కావాలి. అసలీ విద్వేషాలూ వైమనస్యాలూ భగ్గుమనక ముందే మనం మన దేశానికి చేరుకోవడం మంచిదేమో...'' అన్నాడు వర్లు.

★★★

వర్లు మొర తిరుపతి వెంకటేశ్వరుడి దాకా వెళ్ళి వచ్చింది. ఆర్నెల్లు గడిచేలోగా అతనికి ఇండియా వెళ్ళే అవకాశం వచ్చింది.

సరళమౌతోన్న భారత ఆర్థిక విధానాన్ని చూసి ముచ్చటపడిన వర్లూ వాళ్ళ బహుళదేశ ఎరువుల కంపెనీవారు భారతదేశంలో కూడా తమ వ్యాపారాన్ని విస్తరించి భారతదేశపు బడుగు రైతులకు ఎరువులు అమ్మి తమ బొక్కసాలను మరింత దండిగా నింపుకోవాలని నిర్ణయించారు. వాళ్ళు తెరవబోతున్న బొంబాయి బ్రాంచికి భారతీయుడే గాబట్టి - వర్లును మేనేజర్‌గా వెళ్ళమన్నారు. ఎగిరి గంతేసి వర్లు ఒక్క అంగలో అరేబియన్ సీ కోస్ట్‌కొచ్చి పడ్డాడు. 'జననీ జన్మభూమిశ్చ...' అన్నదే అతని గాయత్రి!

జాకీకి కూడా ఏడాదికోసారి ఇండియాకొచ్చి తెలుగు గాలి మేసి వెళ్ళకపోతే ఊపిరాడదు. ఎప్పుడూ మద్రాసు మీదుగా వెళ్ళేవాడు కాస్తా ఈసారి వర్లు ఉన్నాడు గదా అని బొంబాయి మీదుగా తన ప్రయాణ ప్రణాళికను రూపొందించాడు జాకీ.

''ఏరా వర్లు ఎలా ఉందీ ఇండియా లైఫూ'' శాంతాక్రజ్‌లో దిగీ దిగగానే వర్లును కౌగిలించుకొని అడిగాడు జాకీ. ఇద్దరూ కలిసి వర్లు కారులో ఎయిర్‌పోర్టు బయటపడ్డారు. ఓ గంట ట్రాఫిక్‌లో ఈదులాడి మెరైన్ డ్రైవ్ చేరారు. ఆ రహదారి నిండా ఉన్న విద్యుద్దీపాల ధగధగలతో అదో వజ్రాల గొలుసులా మెరిసిపోతోంది. పక్కనే సముద్రం. దూరాన మలబార్ హిల్స్. అంతా కోలాహలం. ఎదురుగా ఉన్న ఎయిరిండియా బిల్డింగ్ సెంటర్లో కార్ల బారుల జోరు.

''ఏం లైఫోరా జాకీ. ఉన్నది ఇండియాలోనే అయినా ఆఫ్రికా ఎడారుల్లోనో అడవుల్లోనో ఉన్నట్టనిపిస్తోంది. ఇక్కడి మరాఠీ వాళ్ళకి మన సౌతిండియన్లంటే ఒళ్ళు మంట! మనమంతా వచ్చి వాళ్ళను ఏదో దోచుకుపోతున్నామన్న దుగ్ధ. ఎపుడు ఎవడొచ్చి మనల్ని కొడతాడోనన్న భయం. వీళ్ళ అహంకారాలకు తోడు గవర్నమెంటు సపోర్టొటి మళ్ళీ. అసలేదేమయినా మనకు మన సౌతిండియానే బెటర్రా! మా వాళ్ళు బెంగుళూర్లో కూడా బ్రాంచి పెడుతున్నారు. అక్కడికి వెళతా... సర్లేగానీ మరి మన పారిస్ కబుర్లు చెప్పు. సైన్‌నది బావుందా? ఐఫిల్ టవరు ఎలా ఉందీ?''

''వర్లూ అంతా బాగానే ఉంది గానీ నీ నిరాశే నన్ను ఆలోచింపజేస్తోంది. దాదాపు ఏడాదిపాటు బొంబాయిలో ఉన్నావు కదా - నువ్విక్కడి లోకల్ వాళ్ళతో కలిసిపోయే ప్రయత్నం చేశావా? ఎవరైనా ఫ్రెండ్సయ్యారా? వాళ్ళింటికి నువ్వూ మీ ఇంటికి వాళ్ళు ఫ్రీగా వచ్చిపోతూంటారా?'' అడిగాడు జాకీ.

''చెప్పినదంతా విని మళ్ళా అదేం ప్రశ్నరా? వీళ్ళకసలు మన పొడే గిట్టదంటోంటే మళ్ళీ స్నేహాలూ ఇళ్ళూ అంటావేమిటి?'' అర్థంగాక అడిగాడు వర్లు.

జాలిగా నవ్వాడు జాకీ.

★★★

''ఏరా నువు లెటరు రాయకపోతేమానే కనీసం నా ఉత్తరాలకు ఫోన్లో అయినా జవాబు చెప్పవచ్చు గదా. అంత బద్ధకమైతే ఎలా?'' బెంగుళూరు విమానాశ్రయంలో వర్లును చూడగానే చిరుకోపంతో అడిగాడు జాకీ.

''ఏంటోరా - అలా రోజులు గడచిపోయాయి. ఈ లోపల మీ కంప్యూటర్ కాన్ఫరెన్స్ కోసం బెంగుళూరు వస్తున్నానని ఈ మెయిల్ పంపావు గదా - సరే ఒక్కసారే ఇద్దరం కలిసి కడుపునిండేలా కబుర్లు చెప్పుకొందాం అని ఆగాను'' ఆప్యాయంగా అన్నాడు వర్లు.

వర్లు కారు ఎయిర్‌పోర్ట్ రోడ్డు దాటి మహాత్మాగాంధీ రోడ్డులో అడుగుపెట్టింది. అర్ధరాత్రయినా జనసందోహం. సెకండ్ షో వదిలినట్టున్నారు గుంపులు గుంపులుగా మనుషులు. వెలుగుతోన్న విద్యుద్దీపాలు. రోడ్డు పక్కనే పెద్దపెద్ద పార్కులు. బ్రిటీష్‌కాలం నాటి అందమైన భవనాలు.

''ఎలా ఉందిరా మన సౌతిండియా జీవితం'' కుశలమడిగాడు జాకీ.

''ఏమోరా! బెంగుళూరు మంచి ఊరే. అనుమానం లేదు. ఇక్కడి మనుషులు కూడా సాత్వికులే - అందులోనూ అనుమానం లేదు. కానీ ఇక్కడా గొడవలూ గందరగోళాలూ మొదలయ్యాయి. కావేరీ వాటర్ వివాదమట. మొన్నామధ్య తారాస్థాయి చేరుకొంది. పెద్దపెద్ద అల్లర్లయ్యాయి. ఆ పొరుగు రాష్ట్రం వాళ్ళు మూటాముల్లే సర్దుకొని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని సరిహద్దులు దాటారు. అది చూస్తే మనం ఇంకా ఆటవిక యుగంలోనే ఉన్నామని అనిపించింది. నిన్న కావేరీ అయింది, రేపు ఏ తుంగభద్రో అయితే మరి మనకీ ఈ ఊళ్ళో మంచినీళ్ళు పుట్టవు. అయినా ఎందుకొచ్చిన గొడవరా ఇదీ! నాకు మన ఆంధ్రా వెళ్ళి పోదామనిపిస్తోంది. మన విజయవాడలో కూడా మా వాళ్ళు మరో బ్రాంచి తెరుస్తున్నారు. అన్నపూర్ణ ఆంధ్రదేశమయితే మరి దానికి ఎరువులేమో అమెరికా ఫ్రాన్సులే ఇవ్వగలవట! నేనా బ్రాంచికి వెళ్ళిపోతాను...''

''బానే ఉంది నీ ఆలోచన. కానీ వర్లూ ఓ మాట మర్చిపోకు. 'ఏదేశమేగినా ఎందుకాలిడినా...' బాపతు దేశభక్తి ఎంత కరెక్టో 'బీయే రోమన్ ఇన్ రోమ్' అన్న మాటా అంతే కరెక్టు. ఇవి రెండూ ఒకే నాణేనికి రెండువైపులు! మరి నువ్వు ఈ విషయంలో బాలెన్స్ చెయ్యలేక పోతున్నావనిపిస్తోంది...''

''ఏమోరా. నాకు మాత్రం ఇన్ని దేశాలు, ఇన్ని ప్రాంతాలూ తిరిగినా జీవితానికీ మనస్సుకూ భద్రత మన తెలుగు దేశపు నడిబొడ్డునే లభిస్తాయని అనిపిస్తోంది'' కొంచెం ఉత్సాహం, కొంచెం నిరాశ వర్లు స్వరంలో.

''సరే వెళ్ళు. నీకా విజయవాడ కృష్ణ నీళ్ళే వొంటపడితే మరి అదీ సంతోషమే గదా'' ప్రోత్సాహంగా అన్నాడు జాకీ.

★★★

... భయం భయంగా దిగులుగా ఫోను ఎత్తాడు వర్లు. దాని గంటల ధ్వని యముని మహిషపు లోహగంటలను స్ఫురింపజేసింది మరి.

''ఒరేయ్ వర్లు... నేనురా... జాకీని... ఎలా ఉన్నారూ అంతా? నాలుగురోజుల్నించీ విజయవాడ వార్తలు వింటూనే ఉన్నాను. ఊరంతా దెబ్బతిన్నదట గదా! అసలేమిటీ గొడవ? మీరంతా బావున్నారా? ఉష ఎలా ఉన్నదీ? పాపా బాబూ క్షేమంగా ఉన్నారా? మరి మీదీ ఆ కులమే కదా - మీకూ ఎంతో కొంత ప్రభావం ఉండే ఉండాలి'' జాకీ కంఠంలో ఆదుర్దా.

''ఏం చెప్పమంటావురా! అంతా సర్వనాశనం అయిపోయింది. ఇలాంటి కుల రాజకీయాలు నేను కలలో కూడా ఊహించలేదు. ఎవరో గూండా కమ్ రాజకీయ నాయకుడు పోవడమేమిటీ దానికి ప్రతిగా ఆ కులం వాళ్ళు మా కులంవాళ్ళను ఊచకోత కొయ్యడమేమిటీ - అసలు నాకిదేం అర్థం కావడం లేదురా. నిన్న మొన్నటిదాకా నా కులం నాకే గుర్తులేదు. అయినా వీళ్ళకి తెలిసిపోయింది. ఇంటిమీద దాడి. విధ్వంసం. మా ఫర్నిచరు పుస్తకాలూ మా కళ్ళ ముందే తగలెట్టేసారు. అదృష్టం బావుండి ప్రాణాలు మిగిలాయి. మళ్ళా ఏ దాడి జరుగుతుందోనని భయం భయంగా ఉంది. ఎమ్మెల్యేల మధ్య తగాదాలూ తల నరకడాలూ ఉంటే అదేదో వాళ్ళూ వాళ్ళూ చూసుకోవాలి గానీ మధ్యలో మేమేం పాపం చేసాంరా?'' బావురుమన్నాడు ఫోన్లోనే వర్లు - మగవాళ్ళు ఏడవడం ఆడతనపు చిహ్నం అని నమ్మే వర్లు.

''ఒరే వర్లూ కంగారుపడకు. మీరు క్షేమంగా ఉన్నారు గదా - అదే చాలు. హైదరాబాద్ ఓ మినిస్టరు మా మామగారి ఫ్రెండు. వాళ్ళకు ఫోనుచేసి మిమ్మల్నా విజయవాడ నుంచి తప్పిస్తాను. ఎయిర్ టికెట్లు పంపిస్తున్నా వెంటనే పారిస్ వచ్చెయ్యండి మీరంతా. గొడవలు సర్దుకున్నాక మళ్ళీ విజయవాడ వెళుదురు గాని. మనిషి స్వార్థంతో తను కూర్చున్న కొమ్మను తానే నరుక్కోవడం అన్నది చరిత్రలో అనేకమార్లు జరిగింది. ఇదేం కొత్తకాదు. బాధపడకు. స్వార్థం ముందు సంస్కృతి, భాష, జాతి, మతం, దేశం అన్న పదాలకు అర్థం ఉండదు. ఇహ భద్రత అంటావా - మనకు మనమే భద్రత. మనం ఎక్కడ అడ్జస్ట్ అవగలిగితే అక్కడే మనకు భద్రత...'' ఓదార్పుగా అన్నాడు జాకీ.

వర్లు ఫోను పెట్టేసాడు ఓ నిట్టూర్పుతో.

అతని మనసులో ఆలోచనలు. కొత్తకొత్త ఆలోచనలు. అలవాటులేని ఆలోచనలు. జీవితాన్ని మార్చే ఆలోచనలు...

★